మూడేళ్లుగా అందని ప్రోత్సాహకం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన మహిళల ఎదురుచూపు
- మూడేళ్లుగా కేవలం కిట్‌తోనే సరిపెడుతున్న ప్రభుత్వం
- వెంటనే నగదు అందించాలని కోరుతున్న మహిళలు

అర్వపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో భాగంగా శిశువులకు అవసరమైన సామగ్రితో పాటు బాలింతలకు నగదు పోత్సాహకం అందించేవారు. పథకం అమలు తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. మూడేళ్లుగా కేవలం కిట్ పంపిణీతోనే సరిపెడుతున్నారు. నగదు సొమ్ము బాలింతల ఖాతాల్లో జమ కావడం లేదు.



అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన బాలింతతో వైద్యసిబ్బంది (ఫైల్)

పేరు మారినా..

2017 జూన్‌లో ఈ పథకం ప్రారంభమైంది. మగ శిశువు పుడితే తల్లి బ్యాంకు ఖాతాలో నాలుగు విడతల్లో రూ.12 వేలు, ఆడ శిశువైతే రూ.13 వేలు జమ చేసేవారు. డబ్బులతో పాటు నవజాత శిశువుకు అవసరమైన సబ్బులు, నూనె, దోమతెర, చిన్న పరుపు, రెండు జతల దుస్తులు, తల్లికి రెండు చీరలు, బేబీ కిట్, రెండు కండువాలు, శిశువుకు అవసరమయ్యే ఇతర సామగ్రితో కూడిన కిట్ ఇచ్చేవారు. అయితే ఇటీవల నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పథకం పేరును మాతాశిశు ఆరోగ్యం (ఎంసీహెచ్)గా మార్చుచేశారు.

మండలంలో 151మంది బాలింతలకు అందని పోత్సాహకం..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి పీహెచ్‌సీలో గత మూడేళ్ల నుంచి 151 మందికి పైగానే మహిళలు ప్రసవించారు. వీరందరికి నగదు పోత్సాహకాలు ఇంతవరకు అందడం లేదు. అయితే వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు బాలింతల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా కిట్లు ఇస్తున్నారు తప్ప నగదు పోత్సాహకాలు రావడం లేదు. ప్రస్తుతం ప్రసవం అయిన వారికి కేవలం కిట్లు మాత్రమే అందజేస్తున్నారు. ఇప్పటికైనా నగదు పోత్సాహకాన్ని విడుదల చేయాలని బాలింతలు కోరుతున్నారు.

ఏడాది నుంచి పోత్సాహకం రాలేదు



అర్వపల్లి పీహెచ్‌సీలో ఏడాది కిందట ప్రసూతి కాగా ఆడబిడ్డ జన్మించింది. అయితే కేవలం కిట్ మాత్రమే ఇచ్చారు. ఇంతవరకు నగదు పోత్సాహకం మంజూరు కాలేదు. ఈ విషయమై వైద్య సిబ్బందిని అడిగితే పైనుంచే రావడం లేదని చెబుతున్నారు.

– నిమ్మల మహేశ్వరి, జాజిరెడ్డిగూడెం

వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం



పీహెచ్‌సీలో ప్రసవించిన మహిళల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. అయితే బాలింతలకు కిట్లను ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే నగదు పోత్సాహకాలు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.

– డాక్టర్. చిలుకూరి మణిదీప్, మండల వైద్యాధికారి

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందజేస్తున్న బాలికలు, సంఘం సభ్యులు



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

భానుపురి : ఆత్మకూరు మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమైక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మండల కేంద్రం కావడంతో ఇక్కడ మోడల్ స్కూల్, కస్తూరిబాగాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వసతి గృహాలు ఉన్నాయని, కానీ బస్సు సౌకర్యం లేదన్నారు. ఇతర రవాణా సదుపాయాలు సైతం లేకపోవడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారని తెలిపారు. ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాలన్నా, మండల కేంద్రంలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులు సూర్యాపేటకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు సూర్యాపేట ఆర్టీసీ డీఎం సురేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమైక్య జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీజ, ఉపాధ్యక్షులు కుసుమ, కోశాధికారి మనీషా, భవాని, మాధవి, ఎంవీ ఫౌండేషన్ బాధ్యులు వి.లలిత, సైదులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని వినతి

ప్రజల అవసరాలకు తగినట్లుగా బస్సుల సంఖ్యను పెంచాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ కోరారు. మంగళవారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ సురేందర్‌కు వినతిపత్రం అందించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగిందన్నారు. దీంతో బస్సులు సరిపోవడం లేదని తెలిపారు. జిల్లాలోని అన్ని మారుమూల పల్లెలకు బస్సులను నడపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, పీఓడబ్ల్యూ నాయకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌లో చైర్మన్ రాజయ్యతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కమిషన్ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డిని తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో కలిశారు. చైర్మన్ రాజయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. స్థానిక సంస్థలకు అధిక నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, మైనార్టీ వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు మహ్మద్ ఖలీమ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ



అడివెంలలో బడి బాట ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అర్వపల్లి : అడివెంల గ్రామంలోని 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి అంగన్‌వాడీలలో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శతకోటి కళమ్మ, శతకోటి సరోజ, ఆయాలు సావిత్రమ్మ, వెంకటమ్మ, రేణుక, మహిళలు పాల్గొన్నారు.

రాధక్క మృతి తీరని లోటు

ఆత్మకూర్(ఎస్) : గోదావరి లోయ, గిరిజన విప్లవోద్యమ నాయకురాలు, చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిణి రాధక్క మరణం విప్లవోద్యమానికి తీరని లోటని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు డేగల వెంకటక్రిష్ణ అన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అనేక త్యాగాలు, పోరాటాలతో ప్రజలను చైతన్యం చేసిన వీరనారి రాధక్క అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. ఆమె త్యాగాలను, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు అల్లుబెల్లి వెంకటరెడ్డి, నల్లగొండ నాగయ్య, జిలేరు, గోపాల్, మైబెల్లి, యల్లయ్య, నర్సిరెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



సంజీవ

నాగారం : నాగారంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా కన్నెబోయిన సంజీవ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కదారి బుచ్చిరాంరెడ్డి, అనంతుల శ్రీనివాస్, అక్కినపల్లి వెంకన్న, బాలగాని సోమయ్య, కన్నెబోయిన శంకర్, చిప్పలపల్లి శ్రీను, అనంతుల నవనీత, పిచ్చమ్మ, మరికంటి సోమయ్య, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

ప్రవాహానికి అడ్డుగా వేసిన రోడ్డును తొలగించాలి



కర్విరాలలో రోడ్డును పరిశీలిస్తున్న ఐబీ ఈఈ విజయ్ కుమార్

తుంగతుర్తి : మండల పరిధిలోని కర్విరాల గ్రామ శివారులో కర్విరాల చెరువు ప్రవాహానికి అడ్డుగా వేసిన రోడ్డును తొలగించాలని ఐబీ ఈఈ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కర్విరాల గ్రామ శివారులోని రోడ్డును పరిశీలించి మాట్లాడారు. చెరువు ప్రవాహానికి అడ్డుగా ఉన్న రోడ్డును 20 మీటర్ల వరకు తొలగించాలని సంబంధిత వ్యక్తి అయిన వెలుగు సునీల్‌కు సూచించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా రోడ్డు ఉంటే పంట పొలాలు మునిగె అవకాశం ఉందని తెలిపారు. రోడ్డును 20 మీటర్ల వరకు తొలగించి అడుగు భాగం నుంచి కాంక్రీటు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ నవీన్ కుమార్, ఏఈ శ్రీకాంత్, ఆర్ఐ మహమ్మద్ అలీ, రైతులు అమరేందర్ రెడ్డి, సునీల్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

అర్వపల్లి : మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వే కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలలో రెండో రోజు మంగళవారం సర్వే చేశారు. రోజుకు 50 ఇళ్ల చొప్పున సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ సందీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మి షన్ భగీరథ పథకం నీళ్ల పరిస్థితి గురించి తెలుసుకొని వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజలు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

సాగుపై అవగాహన కలిగి ఉండాలి



వర్ధమానుకోటలో రైతు నేస్తం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

నాగారం : వానాకాలంలో సాగు చేసే పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ జగ్గు నాయక్ అన్నారు. మంగళవారం వర్ధమానుకోట రైతు వేదికలో డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారు నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో రైతులకు విత్తన కొరత లేకుండా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలను కొనగోలు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు పంట సాగు, తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి పెండోట గణేష్, ఏఈఓలు రమ్య తేజ, సాయిరాజ్, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

ఆత్మకూర్(ఎస్) : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిడ్డనపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బయ్యు చంద్రయ్య తన గేదెను రోజూ మాదిరిగానే మేతకు వదిలాడు. అయితే సోమవారం వీచిన ఈదురుగాలులకు గ్రామ శివారులోని మక్తా కొత్తగూడెం బ్రిడ్జి సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడగా అవి గేదెకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.60 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు చంద్రయ్య కోరారు.

అర్వపల్లి : ఉయ్యాలవాడ గ్రామ శివారులో విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. కుంచమర్తి గ్రామానికి చెందిన మన్నె భిక్షం మంగళవారం తన రెండు పాడి గేదెలను మేతకు వదిలాడు. ఆ గేదెలు గ్రామ శివారులోని పొలం వద్ద మేత మేస్తూ విద్యుత్ ఎల్‌టీ లైన్ వైరుకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు భిక్షం తెలిపారు. కాగా పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్ గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుస్తకావిష్కరణ సభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పుస్తకావిష్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పేదల పక్షాన పోరాడిన యోధుడు పులుసు సత్యం అని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహనీయుడని తెలిపారు. ఈ నెల 23న మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పుస్తకావిష్కరణ సభకు గీత కార్మికులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు తొట్ల ప్రభాకర్ గౌడ్, రమేష్, లింగయ్య, రాములు, గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదల హర్షణీయం

ఆత్మకూర్(ఎస్) : 1530 మంది గోపాల మిత్రలుకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.7,36,18,560ల బకాయి పీఆర్సీలను విడుదల చేయడం హర్షణీయమని గోపాల మిత్రల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆల్దాస్ లింగయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే గోపాలమిత్రులకు పీఆర్సీ బకాయిలు విడుదల చేసిందని అన్నారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూర్యాపేట డివిజన్ కమిటీ మెంబర్ ములకలపల్లి సైదులు, జాకటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2009–10 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మంగళవారం రామన్నగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 14ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆటా, పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, మహేష్, అజాద్, సైదా, శ్రీను, రహీం, సునీత, సరిత, సంధ్య, రవి, లింగస్వామి, సంధ్య, రాజ్‌కుమార్, సతీష్, రవి, అన్వర్, ఉమ, మర్యా, నందిని, స్వప్న, మధు, సైదులు, రేణుక, జహంగీర్, సుమన్ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పెన్‌పహాడ్ : పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రవి



తిరుమలగిరిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారి ఐ.శాంతయ్య

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందజేస్తోందని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, విద్యా కమిటీ మెంబర్లు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫామ్ దుస్తులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బండారు శేఖర్, నల్లా శ్రీనివాసులు, సురేందర్‌రెడ్డి, మేకల రాజశేఖర్, సీఆర్పీలు సైదయ్య, వహీద్, నాగు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.అశోక్‌రెడ్డి, దస్తగిరి, ఉపేందర్, కె.సత్యనారాయణ, జి.సోమేష్, ఎల్‌డీఏ శ్యామ్ పాల్గొన్నారు.

అర్వపల్లికి చేరిన పాఠ్య పుస్తకాలు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు మంగళవారం అర్వపల్లిలోని ఎమ్మార్సీకి వచ్చాయి. పాఠ్య, నోట్‌పుస్తకాలు 18వేల వరకు రాగా ఎమ్మార్సీలో ఉంచారు. ఈ సారి పూర్తి స్థాయిలో ఒకేసారి పాఠ్య, నోట్ పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. పాఠశాలలకు వెంటనే ఈ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ జానయ్య, సిబ్బంది బింగి ఏడుకొండలు పాల్గొన్నారు.

సుధాకర్ కుటుంబానికి పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న రామచంద్రయ్య

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ (డప్పు సుధాకర్) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చిప్పలపల్లి మల్లయ్య, సోమయ్య, రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు



కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండా ప్రజల కష్టాలు తీరుతున్నాయి. ఈ తండాకు ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.10 కోట్లతో మూడు కిలోమీటర్ల మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నారు. అలాగే ఈ రహదారిపై అవసరమైన చోట్ల బ్రిడ్జిలు నిర్మించారు. బీటీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్ల బీటీరోడ్డు నిర్మాణ కల తీరుతుండటంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తిరుమలగిరి : తొండ గ్రామంలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పిల్లలు



నూతనకల్‌లో..

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు పరమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలు కల్పించబడతాయని అన్నారు. పాఠశాలల్లో ఉచిత దుస్తులు, ఉచిత పుస్తకాలు, నోటుబుక్కులు అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఉత్తమమైన విద్యార్థులుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఫర్వీణ, అంగన్వాడీ టీచర్ లక్ష్మీబాయి ఆయాలు పుష్ప, ఎలేంద్ర పాల్గొన్నారు.

తిరుమలగిరి : బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తొండ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతనంగా 15 అడ్మిషన్లు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మురళి, ఎస్‌కే.జానిబేగం, అంగన్‌వాడీ టీచర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మద్దిరాల : బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ధరావత్ వెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 6వ రోజు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు అన్ని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మంచి విద్యను అందిస్తున్నాయని తెలిపారు. ఎంతో ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు విద్య అందించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమావత్ రమేష్, వెంకటేశ్వర్లు, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.


బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలి

నూతనకల్ : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రాములు నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు గ్రామాల్లో పర్యటించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నాగారం : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎం.నారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ప్రాథమిక, జెడ్పీహెచ్ఎస్‌ల ఆధ్వర్యంలో ఆరవ రోజు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రమేష్, హేమమాలిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాలలో..



తుంగతుర్తి : కొత్తగూడెంలో..



నాగారం : ఫణిగిరిలో..

ప్రభుత్వ చిహ్నంలో మార్పులు చేయాలని వినతి



నాగారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

నాగారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజముద్ర చిహ్నంలో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) సూచించిన మార్పులు చేయాలని కోరుతూ డీఎస్పీ నాయకులు మంగవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ షాహిన్‌బేగంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మండల కన్వీనర్ చిప్పపల్లి నాగార్జున మాట్లాడారు. ఉస్మానియా యూనివర్శిటీని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని, పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క, సారక్క చిత్రాలను ముద్రించాలని కోరారు. డీఎస్పీ పార్టీ ప్రతిపాదిస్తున్న ఆరు చిత్రాలను నూతన రాజముద్రలో పెట్టడం ద్వారా సమాజంలో సమానత్వ భావనని, పీడీత వర్గాల యోధుల పోరాట స్ఫూర్తిని చాటవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ప్రచార కమిటీ నాయకులు డి.విజయ రామరాజు, గైగుళ్ల నిరంజన్ పాల్గొన్నారు.

ప్రజా కళాకారులను ఆదుకోవాలని సీఎంకు లేఖ

అర్వపల్లి : 1982 నుంచి ప్రజలను చైతన్య పర్చడానికి తమ గానం వినిపిస్తున్న ప్రజా కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీర పాపయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో అర్వపల్లి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను పంపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 550 మంది కళాకారులకు మాత్రమే సాంస్కృతి సారథిలో ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన వేల మంది ఏ పనులు లేకుండా ఇ బ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వంలోనైనా అర్హులైన కళాకారులందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శతకోటి వెంకన్న, యాతాకుల యాదయ్య, పద్మ, సరస్వతి, రమేష్, వీరన్న, వెంకన్న పాల్గొన్నారు.

స్కావెంజర్లను నియమించాలి

చివ్వెంల : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను వెంటనే నియమించాలని టీపీయూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వర్కర్స్‌ను నియమించినప్పటికీ, కరోనా సమయంలో గత ప్రభుత్వం వారిని తొలగించిందన్నారు. కానీ ఇంతవరకు వారిని తిరిగి నియమించలేదని, దీని వల్ల పాఠశాలలు అపరిశుభ్రంగా మారాయన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి పనులు చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు రాకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తుందని, దీంతో పాటు స్కావెంజర్లను నియమించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రవేశాలకు ఆహ్వానం

అర్వపల్లి : అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో ఈ విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రత్యేక అధికారిణి నాగరాణి మంగళవారం తెలిపారు. 7, 8, 9, 10 తరగతుల్లో సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. 6వ తరగతిలో అర్హులైన బాలికలు చేరాలని కోరారు.